## గోల్కొండలో బాలికపై లైంగికదాడి

### ఓయో రూం మేనేజర్, యజమాని, నిందితులపై కేసులు నమోదు

మెహిదీపట్నం, నవంబర్ 17: బాలికకు మాయమాటలు చెప్పి.. ఓయో రూంకు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడిన యువకుడితో పాటు అతడి స్నేహితుడిపై, ఓయో రూం యజమాని, మేనేజర్‌పై గోల్కొండ పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ కథనం ప్రకారం.. గోల్కొండ తకత్‌బౌలి ప్రాంతంలో నివసించే సయ్యద్ అబ్దుల్ నదీం (23)ఎలక్ట్రిషియన్. అదే ప్రాంతంలో నివసించే ఓ బాలికకు మాయమాటలు చెప్పి.. ఈనెల 13వ తేదీ రాత్రి ఓయో రూమ్‌కు రావాలని చెప్పాడు. తన స్నేహితుడైన సయ్యద్ నజీరుద్దీన్ అలియాస్ షోయబ్‌కు ఆ బాలికను తీసుకుని నెక్‌నాంపురాలో ఉన్న ఓయో హోటల్‌కు రావాలని సూచించాడు. దీంతో షోయబ్ తన బైక్‌పై బాలికను ఓయో హోటల్‌కు తీసుకువెళ్లాడు. ఇదిలా ఉండగా.. ఆ బాలిక ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆందోళనతో అంతటా వెతికారు. 14వ తేదీ తెల్లవారుజామున షోయబ్ ఆ బాలికను బైక్‌పై తీసుకెళ్లి ఆమె ఇంటికి సమీపంలో దింపి వెళ్లాడు. ఈ దృశ్యాన్ని బాలిక తల్లి గమనించింది. విషయం తెలుసుకొని.. బాలిక తల్లి గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా.. బాలికను తన మాయమాటలతో నమ్మించిన సయ్యద్ అబ్దుల్ నదీం ఆమెను ఓయో రూంకు పిలిపించి.. లైంగిక దాడికి పాల్పడినట్టు గుర్తించారు. ఎలాంటి విచారణ చేయకుండా ఓయో హోటల్‌లో రూమ్ ఇచ్చిన మేనేజర్ జాన్ సింగ్(23), హోటల్ యజమాని ముంత విజయ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సయ్యద్ అబ్దుల్ నదీం, అతడికి సహకరించిన షోయబ్‌ను రెండు రోజుల కిందటనే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. ఓయో హోటల్ యజమాని ముంత విజయ్, మేనేజర్ జాన్‌సింగ్‌ను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నదని చెప్పారు.

## కళాశాల బస్సు ఢీకొని..స్కూటరిస్టు మృతి

దుండిగల్, నవంబర్ 17: కళాశాల బస్సు ఓ యువకుడి ప్రాణాలు బలి తీసుకుంది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన మహ్మద్ మోసీన్ (20) బ్లింకిట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మోసీన్ తన డియో స్కూటీపై బాచుపల్లి చౌరస్తా నుంచి మియాపూర్ వైపు వెళుతుండగా.. బొల్లారం చౌరస్తా సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన చింతల్‌లోని శ్రీచైతన్య కళాశాలకు చెందిన బస్సు ఢీ కొటింది. ఈ ప్రమాదంలో మోసీన్ రోడ్డుపై పడిపోగా.. అతడి తల పైనుంచి బస్సు ముందు చక్రాలు వెళ్లాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నారికి ఉరివేసి.. తల్లిదండ్రుల ఆత్మహత్య

### *బిర్లా ప్లానిటోరియం ఉద్యోగులే కారణమంటూ సూసైడ్ నోట్*

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: ముక్కుపచ్చలారని నాలుగేళ్ల చిన్నారికి ఉరివేసి.. తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తమ ఆత్మహత్యలకు కారణం.. బిర్లా ప్లానిటోరియం ఉద్యోగులేనని పేర్కొంటూ సూసైడ్ నోట్ రాశారు. ఇన్‌స్పెక్టర్ శంకర్ కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన కొప్పుల సాయికృష్ణ (35)కు కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన చిత్రకళ (28)తో వివాహమైంది. వారికి తేజస్విని (4) అనే కూతురు ఉంది. వీరు గంగపుత్ర కాలనీలో నివాసముంటున్నారు. సాయికృష్ణ ర్యాపిడోలో బైక్ రైడర్‌గా పనిచేస్తుండగా, చిత్రకళ నగరంలోని బిర్లా ప్లానిటోరియంలో ఉద్యోగం చేసింది. గురువారం రాత్రి తేజస్వినికి ఉరివేసి, దంపతులు కూడా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గత నెలాఖరులో చిత్రకళను ప్లానిటోరియంలో ఉద్యోగం నుంచి తొలగించారు. తప్పుడు ఆరోపణలతో తనను టెర్మినేట్ చేశారని పేర్కొంటూ ఆమె సూసైడ్ నోట్ రాసింది. అవినీతికి పాల్పడిన వ్యక్తులను వదిలేసి.. తనను బాధ్యులుగా చేశారని వాపోయింది. తన ఆత్మహత్యకు బిర్లా ప్లానిటోరియం ఉద్యోగులే కారణమని పేర్కొంది. వారిని వదిలిపెట్టకూడదని విజ్ఞప్తి చేసింది. మీడియాకు సమాచారమిచ్చినా సహాయపడలేదని పేర్కొన్నారు. మృతుల సంబంధీకులకు సమాచారం అందించామని పోలీసులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆటోపై పడిన టిప్పర్.. ఆటో డ్రైవర్ మృతి



మేడ్చల్, నవంబర్ 17 : ఆటోపై టిప్పర్ పడిన ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుతారిగూడ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజన్నసిరిసిల్లా జిల్లాకు చెందిన మహ్మద్ అజీజ్ (32) మేడ్చల్ పట్టణంలోని హ్యాపీనగర్ కాలనీలో ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఆటోలో గుండ్లపోచంపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో హెయర్ గోదాం వద్ద ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు వైపు యూ టర్న్ తీసుకుంటుండగా.. మేడ్చల్ చెక్‌పోస్టు నుంచి గుండ్లపోచంపల్లి వైపు వస్తున్న టిప్పర్ ఆటోపై బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ అజీజ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- పట్టణాల్లో రెండు నిమిషాలు..గ్రామీణ ప్రాంతాల్లో ఏడు నిమిషాల్లో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలి
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశమైన సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

బండ్లగూడ, నవంబర్ 17: పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. పట్టణాల్లో 2 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 7 నిమిషాల్లోపు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో జరిగిన పోలీసు అధికారుల సమావేశంలో ఆయన వారికి పలు సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలు, సమస్యలు.. జాగ్రత్తలపై చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ స్టేషన్ల వద్ద మరింత బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. రాజేంద్రనగర్ జోన్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్, కేంద్ర సాయుధ బలగాల వినియోగం.. తదితర అంశాలపై కూడా చర్చించారు. పోలింగ్ లొకేషన్లు, పోలింగ్ స్టేషన్ ప్రాంతాలలో తీసుకోవాల్సిన అన్ని చర్యలు, మార్గదర్శకాలను ఈ సందర్భంగా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరించారు. ఇందులో భాగంగానే బార్డర్ తనిఖీ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పోలింగ్ కంటే 72 గంటల ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యేకంగా తెలిపారు. ఎస్‌ఎఫ్, ఎస్ఎస్‌ఎఫ్, క్యూఆర్‌టీ బృందాలు క్లిష్టమైన ప్రాంతాలలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, చేవెళ్ల ఏసీపీ, పలువురు ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న తనిఖీలు..

### *రూ.3.62 కోట్ల నగదు సీజ్*



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ, పట్టుబడిన నగదు

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా శుక్రవారం పోలీస్ అథారిటీ ద్వారా రూ.3,93,500 నగదు సీజ్ చేశారు. ఇప్పటి వరకు రూ. 3,62,40,950 నగదును సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 755 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. నాన్‌బెయిలబుల్ వారంట్ కేసులు 2320, 3371 నక్కాస్ ఆపరేషన్స్, 4573 లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనాల దుర్వినియోగం కింద గోషామహల్ నియోజకవర్గంలో ఒక కేసు నమోదైనట్టు తెలిపారు. 148 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

### ద్విచక్ర వాహనపై నగదు తరలింపు

#### రూ. 37 లక్షలు సీజ్ చేసిన పోలీసులు

చార్మినార్,నవంబర్ 17 : ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతున్నదని దక్షిణ మండల డీసీపీ సాయిచైతన్య తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. దివాన్‌దేవిడీలో పట్టుబడిన రూ.37 లక్షల వివరాలను వెల్లడించారు. చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దివాన్‌దేవిడి ప్రాంతంలో చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారని తెలిపారు. బండ్లగూడకు చెందిన మర్రి రాజ్‌కుమార్, మరోవ్యక్తి అనిల్‌కుమార్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నారని చెప్పారు. అనిల్ చేతిలో బ్యాగ్‌ను గుర్తించిన పోలీసులు.. వాహనాన్ని ఆపి డిక్కీని పరిశీలించారని, రూ. 37 లక్షలు లభించాయన్నారు. నగదుకు సంబంధించి ప్రశ్నించగా.. వారినుంచి సరైన సమాధానం రాలేదని డీసీపీ తెలిపారు. దీంతో ఆ నగదును సీజ్ చేసి, ఐటీ శాఖకు అప్పగిస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌తోపాటు చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్, చార్మినర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఇన్‌స్పెక్టర్ బాలస్వామితోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హవాలా దందా గుట్టురట్టు

### రూ.10 లక్షలు పట్టివేత

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): హవాలా దందా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 10 లక్షల నగదును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన వ్యాపారి వి.చంద్రశేఖర్, ప్రైవేట్ ఉద్యోగి ప్రభాకర్ హవాలా ద్వారా నగదును రవాణా చేస్తుంటారు. గురువారం రాత్రి బేగంబజార్‌లో నగదు జమ చేసుకొని, షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆ డబ్బును అందించేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ బృందం బేగంబజార్‌లో ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. వారి వద్దనున్న బ్యాగ్‌లో పరిశీలించగా.. రూ. 10 లక్షల నగదు పట్టుబడింది. పన్ను చెల్లించకుండా.. అక్రమ మార్గంలో నగదు రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వారిద్దరిని అరెస్ట్ చేసి, తదుపరి విచారణ నిమిత్తం షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ నిఖితా పంత్ తెలిపారు.

## సబ్సిడీ బియ్యం అక్రమ రవాణా.. ఇద్దరు అరెస్ట్

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): అక్రమ మార్గంలో పీడీఎస్ బియ్యాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ నివాసి మహ్మద్ సలావుద్దీన్ అక్రమ మార్గంలో సబ్సిడీ బియ్యాన్ని తరలిస్తూ ఇప్పటి వరకు ఐదుసార్లు పోలీసులకు చిక్కాడు. అతడిపై కేసులున్నాయి. అయినా.. అతడి ప్రవర్తన మార్చుకోలేదు. ముషీరాబాద్ ప్రాంతంలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని.. ప్రభుత్వం పేదలకు అందించే సబ్సిడీ బియ్యాన్ని రూ.10లకు కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని సంచుల్లో నింపి, రాజేంద్రనగర్, జహీరాబాద్, నాందేడ్, బీదర్‌కు తరలిస్తూ.. అక్కడ రూ.30 నుంచి రూ. 35లకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. శుక్రవారం మహ్మద్ సలావుద్దీన్ టాటా ఏస్ వాహనాన్ని మాట్లాడుకొని.. డ్రైవర్ మహ్మద్ రుక్నుద్దీన్ సహాయంతో బియ్యాన్ని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చిక్కడపల్లిలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. అందులో రూ.70 వేల విలువైన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ ముఠాను చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

### *రాచకొండ షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్*



సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): మహిళల సంరక్షణే ధ్యేయంగా రాచకొండ షీ టీమ్స్ పనిచేస్తున్నదని మహిళా సేఫ్టీ డీసీపీ ఉషావిశ్వనాథ్ అన్నారు. గత పదిహేను రోజుల్లో పట్టుబడిన 126 మంది ఆకతాయిలకు శుక్రవారం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయం ఆవరణలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, విద్యా సంస్థలు, ఇతర రద్దీ ప్రాంతాలలో షీ టీమ్స్ నిఘా ఉంటుందన్నారు. షీ టీమ్స్ నిఘాలో పలువురు పోకిరీలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నారని తెలిపారు. అక్టోబర్ 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 148 ఫిర్యాదులు అందాయన్నారు. మంచాల్ మండలంలో దసరా సెలవుల్లో హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన బాధితురాలు తన మేన మామ ఇంటికి వెళ్లింది. బాలిక నిద్రపోయిన తరువాత ఆ బాలికపై మేనమామ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక ఇబ్రహీంపట్నం షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశామన్నారు. మరో ఘటనలో.. పెదనాన్న కొడుకు అయిన అన్న నాలుగు సంవత్సరాలుగా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చెల్లిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. తనను ప్రేమించాలని, లేదంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి సర్క్యులేట్ చేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు వనస్థలిపురం షీ టీమ్స్‌ను ఆశ్రయించడంతో.. నిందితుడిపై మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇదిలాఉండగా.. గత 15 రోజుల్లో 53 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు డీసీపీ తెలిపారు. వివిధ రకాలుగా యువతులు, మహిళలను వేధించే వారిపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.